
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 21 । ఆగస్టు । 2025





**సోమశిలలో 52.180 టీఎంసీలు**
జలాశయంలో బుధవారానికి 52.180 టీఎంసీలు ఉన్నాయి. 30,257 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 1850, కండలేరుకు 9 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రా) | రూ.1,01,750 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) | రూ.9,187 |
| 3 శాతం జీఎస్టీతో | రూ.9,463 |
| నవర (8 గ్రా) | రూ.75,704 |

గరిష్టం/కనిష్టం
35.3 /25.3

**వాతావరణం**
జిల్లాలో గురువారం వాతావరణం మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ చిరు జల్లుల నుంచి మోస్తరు జల్లులు కురిసే అవకాశం ఉంది. బుధవారం గాలిలో తేమ 56 శాతంగా ఉంది.

## న్యూస్‌రీల్

### 29 నుంచి ఐటీఐల్లో మూడో విడత కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 29న ప్రభుత్వ, 30న ప్రైవేట్ ఐటీఐల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీఐ కళాశాలల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అడ్మిషన్లకు హాజరయ్యే వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 27వ తేదీలోపు ఏదైనా ఐటీఐలో సర్టిఫికెట్లు ధ్రువీకరణ చేయించుకోవాలన్నారు. వివరాలకు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐని సంప్రదించాలన్నారు.

### విద్యార్థిని మృతిపై ఫోర్ మెన్ కమిటీ నియామకం

- విచారించి వారంలో నివేదిక ఇవ్వాలన్న కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు (టౌన్): నగరంలోని అన్నమయ్య సర్కిల్‌లో ఉన్న ఆర్ఎన్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థిని హేమశ్రీ ఆత్మహత్య ఘటనపై ఎట్టకేలకు జిల్లా యంత్రాంగం స్పందించింది. విద్యార్థిని మృతిపై విచారించి నివేదిక అందించాలని కలెక్టర్ ఆనంద్ బుధవారం ఫోర్‌మెన్ కమిటీని నియమించారు. ఏపీ మైక్రో ఇరిగేషన్ కార్పొరేషన్ (ఎంఐసీ) పీడీ, బీసీ కార్పొరేషన్ జిల్లా అధికారి, డీఈఓ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులను కమిటీలో సభ్యులుగా నియమించారు. విద్యార్థినీ హేమశ్రీ మృతిపై సమగ్ర విచారణ చేపట్టి వారంలోగా పూర్తిస్థాయి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

**'సాక్షి' కథనంపై సుమోటోగా తీసుకున్న హైకోర్టు**
ఆర్ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థినీ హేమశ్రీ మృతిపై 'సాక్షి'లో వచ్చిన కథనాన్ని రాష్ట్ర హైకోర్టు సుమోటోగా తీసుకున్నట్లు తెలిసింది. విద్యార్థినీ మృతిపై రాష్ట్ర ఇంటర్ బోర్డు, జిల్లా శిశు సంక్షేమ శాఖ, లోక్ అదాలత్, డైరెక్టర్ ఆఫ్ పోలీస్ శాఖల అధికారులకు నోటీసులు జారీ చేశారు. అన్ని కోణాల్లో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి వీడియోల సాక్ష్యాలను అందజేయాలని ఆదేశించినట్లు సమాచారం.

### సీతారామపురం తహసీల్దార్ సస్పెన్షన్



కృష్ణారెడ్డి

సీతారామపురం : సీతారామపురం తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి సస్పెండ్ చేస్తూ జిల్లా అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీతారామపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 68–5లోని సమస్యాత్మకమైన 0.40 సెంట్ల భూమిని నిబంధనలకు విరుద్ధంగా మ్యుటేషన్ చేశారనే ఆరోపణపై కలెక్టర్ విచారణ జరిపి తహసీల్దార్‌ను సస్పెండ్ చేసినట్లు సమాచారం. సదరు సర్వే నంబర్ 68–5లో తోట నరసింహులుకు చెందిన 0.81 సెంట్ల భూమి కోసం అతని సంబంధీకులైన ఇరువర్గాల వారి మధ్య కొంత కాలం నుంచి విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో తహసీల్దార్ నిబంధనలకు విరుద్ధంగా మ్యుటేషన్ చేశారని ఆరోపిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

### ఐదుగురిపై కేసు నమోదు




నిందితులను అరెస్ట్ చేసినట్లు వివరాలు తెలియజేస్తున్నట్లు కావలి డీఎస్పీ

కావలి (జలదంకి): జలదంకి మండలం అన్నవరం క్వారీ వద్ద డ్రోన్‌తో విజువల్స్ తీస్తూ కావలి ఎమ్మెల్యేపై హత్యాయత్నం చేసేందుకు ప్రయత్నించారనే కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ శ్రీధర్ వెల్లడించారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇస్కారపు వేణు, గోళ్ల వినోద్‌కుమార్, దామెర్ల శ్రావణ్‌కుమార్, ఆత్మకూరు రాజేష్, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఏ5 నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డికి రాజకీయ శత్రుత్వం ఉంది. దీంతో కృష్ణారెడ్డిని హతమార్చాలని ఏ5 ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏ1, ఏ2, ఏ3, ఏ4 నిందితులు అన్నవరం క్వారీ వద్ద ఎమ్మెల్యే రాకను గమనించి అంతమొందించాలని డ్రోన్‌తో పరిశీలిస్తుండగా క్రషర్‌లో పని చేసే ఏడుకొండలతో పాటు సిబ్బంది డ్రోన్‌ను పసిగట్టి అడ్డుకున్నారు. దీంతో నలుగురు నిందితులు క్రషర్ సిబ్బందిపై కత్తులు, రాళ్లతో దాడులు చేసి అక్కడి నుంచి పారిపోయారు. దీంతో ఐదుగురిపై కేసు నమోదు చేశామన్నారు. జలదంకి ఎస్సై లతీఫున్నీసా ఏ1, ఏ2 నిందితులైన వేణు, వినోద్‌లను బుధవారం ఉదయం 10 గంటల సమయంలో జమ్మలపాళెం వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

# ఆటోకు 'నారా' పోటు

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా రూ.10 వేలు**
- వరుసగా ఐదేళ్లు అకౌంట్‌లో జమ
- కూటమి వస్తే ఏటా రూ.15 వేలిస్తామని హామీ
- రెండో ఏడాది వచ్చినా ఆ ఊసే లేదు
- ఇప్పటికే పోలీసు, రవాణా అధికారుల కేసులతో సతమతం
- ఈఎంఐలు చెల్లించలేక ఇబ్బందుల పాలు
- ఆటోల్లో ప్రయాణించేది ఎక్కువ మంది మహిళలే
- వారంతా ఉచిత బస్సుల్లో ప్రయాణం




చంద్రబాబు మోసానికి గురైన వారి జాబితాలో ఆటోడ్రైవర్లు చేరారు. గతంలో వీరికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'వాహన మిత్ర' పథకం ద్వారా ఆర్థిక సాయం చేస్తే.. కూటమి అధికారంలోకి వస్తే అంతకుమించి ఏటా రూ.15 వేలిస్తామని హామీలిచ్చి వెన్నుపోటు పొడిచింది. మరో వైపు సరైన బాడుగలు లేక నెల నెలా ఫైనాన్స్ వాయిదాలు చెల్లించలేక సతమతమవుతున్నారు. ఈ తరుణంలో సకాలంలో ఫిట్‌నెస్, ఇన్సూ్యరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు చేయించలేదంటూ పోలీసులు, రవాణాశాఖాధికారులు రాసే కేసులు, వేసే జరిమానాలకు అల్లాడిపోతున్నారు. గోరుచుట్టుపై రోకటి పోటు అన్నట్లుగా తాజాగా ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయడంతో కనీసం రోజు వారి ఆయిల్ ఖర్చులు కూడా రావడం లేదని గొల్లుమంటున్నారు.

నెల్లూరు (టౌన్): 'ఎంకి పెళ్లి సుబ్బిచావుకొచ్చింది' సామెత చందానా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం జిల్లాలో ఆటో డ్రైవర్ల బతుకును దెబ్బ తీసింది. జిల్లాలో ఉద్యోగం, ఉపాధి అవకాశా లు లేకపోవడంతో ఎంతో మంది నిరుద్యోగులు ఫైనాన్స్ సంస్థల నుంచి రుణాలు తీసుకుని ఆటోలు కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతున్నారు. మరికొందరు ఆటోలను రోజువారి అద్దెకు తీసుకుని తిప్పుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కాలక్రమంలో ఆటోల సంఖ్య కూడా గణనీయంగా పెరగడంతో ఆటో డ్రైవర్లకు రాబడి తగ్గుతూ వస్తోంది. ఈ క్రమంలో ఆటోలకు ఫిట్‌నెస్, ఇన్సూ్యరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు కోసం ఆటో యజమానులు అప్పులు పాలవుతున్నారని గుర్తించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే వాహనమిత్ర పథకం అమలు చేశారు.

**ఉచిత బస్సులతో ఆటో కార్మికుల తప్పని ఉరి**
రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ఈ నెల 15వ తేదీ నుంచి ప్రవేశ పెట్టిన స్త్రీశక్తి పథకం (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం)తో ఆటో కార్మికుల పరిస్థితి దారుణంగా మారింది. ఇప్పటి వరకు ఎక్కువ మంది మహిళలు ఆటోల్లో ప్రయాణించే వారని ఇప్పుడు, ఉచిత బస్సుతో ఆటోల్లో ఎక్కే వారు లేకపోవడంతో వారి జీవనం గగనంగా మారింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చకుండా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం చేసి మమ్మల్ని రోడ్ల పాల్జేశారని ఆటో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కూటమి వచ్చి.. మోసం చేసి..**
కూటమి అధికారంలోకి వస్తే గత ప్రభుత్వం ఇచ్చిన వాహనమిత్ర పథకం సాయం కంటే మిన్నగా రూ.15 వేలు ఇస్తామని హామీలు గుప్పించింది. గతేడాది ఈ సాయం ఎగనామం పెట్టారు. ఈ ఏడాది ప్రారంభమైనా ఇంత వరకు ఆ ఊసే లేదు. సరైన బాడుగలు లేక.. రాబడి లేక నెల నెలా ఆటోలకు ఫైనాన్స్ బకాయిలు చెల్లించలేకపోతుంటే.. మరో వైపు సకాలంలో ఫిట్‌నెస్, ఇన్సూ్యరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇప్పటికే పోలీసు, రవాణా శాఖ అధికారుల నమోదు చేస్తున్న కేసులతో సతమతవుతున్నారు.



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఏటా అందజేసి

**వాహన మిత్రతో భరోసా**
వాహనమిత్ర పథకం ఆటో కార్మికుల్లో భరోసా నింపిందని ఆటో కార్మికులు చెబుతున్నారు. వాహన మిత్ర పథకంలో భాగంగా అందజేసే రూ.10 వేలతో ఆటోకు సంబంధించి ఫైనాన్స్, ఇన్సూ్యరెన్స్, త్రైమాసిక పన్నును క్రమం తప్పకుండా చెల్లించుకుంటున్నామంటున్నారు. దీంతో పోలీసు, రవాణా కేసులు బాధ కూడా తగ్గిపోయింది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా 5 ఏళ్లు వాహన మిత్ర పథకాన్ని అమలు చేశారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఆటో కార్మికుడుకు రూ. 10 వేలు నగదును వారి ఆకౌంట్లలో జమ చేయడంతోపాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాల సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలు ఎంతో సంతోషంగా ఉన్నాయి.

| సంవత్సరం | ఆటో కార్మికులు | నగదు |
|---|---|---|
| 2019–20 | 18,480 | రూ.18,48,00,000 |
| 2020–21 | 21,257 | రూ.21,25,70,000 |
| 2021–22 | 18,955 | రూ.18,95,50,000 |
| 2022–23 | 16,772 | రూ.16,77,20,000 |
| 2023–24 | 16,516 | రూ.16,51,60,000 |

**జిల్లాలో 40 వేలకు పైగా ఆటోలు**
జిల్లాలో 40 వేలకు పైగా ఆటోలు ఉన్నాయి. 40 వేల కుటుంబాలు ఆటోలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. డిగ్రీ, పీజీ చేసిన వారు సైతం ఉద్యోగాలు రాక ఆటోలను కొనుగోలు చేసి వాటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఫైనాన్స్‌ల్లో రుణం తీసుకుని ఆటోలను కొనుగోలు చేసి వాటి మీద వచ్చే ఆదాయంలో కొంత మొత్తాని నెలవారీ వాయిదా చెల్లిస్తున్న పరిస్థితి. స్త్రీ శక్తి పథకం అమలుతో ఆటోల్లో ఎక్కే వారు లేక ఆయా స్టాండ్లో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల రూట్లలో తిరిగే ఆటో కార్మికులు అక్కడ ప్రయాణించే వారు లేక పోవడంతా వారంతా పట్టణాలు, నగరాల్లో వచ్చేస్తుండటంతో రోజు రూ.200 నుంచి రూ.300లు కూడా సంపాదన లేదని ఆవేదన వక్తం చేస్తున్నారు. దీంతో ఆటోలను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆటోలపై ఆధారపడే నిరుద్యోగులకు ఏటా రూ.25 వేలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఎన్నికల హామీని అమలు చేయాలి**



ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. హామీ నెరవేర్చకుండా ఫ్రీ బస్సు పథకం అమలు చేయడం సరికాదు. ఇప్పటికే మా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పోలీసు, రవాణా కేసులుతో ఆటోలను తిప్పలేని పరిస్థితి. ఇప్పుడు ఉచిత బస్సు పథకం అమలు చేసి మమ్మల్ని మరింత ఇబ్బందుల పాలు చేస్తున్నారు.
– కోలగట్ల సురేష్, జిల్లా అధ్యక్షుడు, ఆటో కార్మిక సంఘం

**నెలకు రూ.4వేలు ఫించన్ ఇవ్వాలి**



ప్రతి ఆటో కార్మికుడి కుటుంబానికి నెలకు రూ.4 వేలు పింఛన్ ఇవ్వాలి. జీఓ నం. 21తో ఆటో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఫైనాన్స్, ఇన్సూరెన్స్ కట్టలేక అప్పులు చేసి మరి ఆటోలు తిప్పుతున్నారు. గత ప్రభుత్వం ప్రతి ఆటో కార్మికునికి రూ.10 వేలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయినా నేటికి ఆ ఊసే లేదు. ఇప్పటికైనా హామీని నెరవేర్చాలి.
– మారుబోయిన రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆటో కార్మిక సంఘం

**జీవనం గందరగోళం**



ఉచిత బస్సు పథకం అమలుతో ఆటో కార్మికుల జీవనం మరింత దుర్భరంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆటోలు ఎక్కేది ఎక్కువగా మహిళలే. ఇప్పుడు వారంతో బస్సుకు పోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆటోలను అమ్ముకోవాల్సిందే. ఎన్నికల్లో ఇచ్చిన హామీ వెంటనే నెరవేర్చి ఆటో కార్మికును ఆదుకోవాలి.
– దేవతాటి లవణకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు, ఆటో కార్మిక సంఘం

## నిధుల గోల్‌మాల్‌పై డీఎల్‌పీఓ విచారణ



ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ చేపడుతున్న ఆత్మకూరు డీఎల్‌పీఓ రమణయ్య

సాక్షి ఎఫెక్ట్..

సీతారామపురం: మండలంలో విధులు నిర్వహిస్తూ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన ఓ ఎంపీడీఓ రూ.11 లక్షలకు పైగా నిధులను స్వాహా చేశారనే ఆరోపణల నేపథ్యంలో ఈ నెల 2న 'సాక్షి'లో 'నిధుల గోల్‌మాల్' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జెడ్పీ సీఈఓ మోహన్‌రావు ఆత్మకూరు డీఎల్‌పీఓ టి.రమణయ్యను విచారణ అధికారిగా నియమించారు. ఆయన బుధవారం సీతారామపురం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేపట్టారు. నిధులకు సంబంధించి జరిపిన బ్యాంకు లావాదేవీల స్టేట్‌మెంట్‌ను పరిశీలించారు. బిల్లులు, ఓచర్లు, ఎవరితో నగదు డ్రా చేయించారు తదితర విషయాలతోపాటు, కార్యాలయ సిబ్బంది సహాయ సహకారాలపై కూడా ఆరా తీసి సమగ్ర వివరాలు సేకరించారు. తుది నివేదికను జెడ్పీ సీఈఓకు అందిస్తామన్నారు. అనంతరం అయ్యవారిపల్లి, బసినేనిపల్లి సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆయనతోపాటు ఎంపీడీఓ సాయిప్రసాద్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## జూనియర్ కళాశాలలకు నోటీసులు

నెల్లూరు (టౌన్): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పలు కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు రెండు రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 12న 'సాక్షి'లో 'చదివిస్తారనుకుంటే చావు చూపిస్తున్నారు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఇంటర్ బోర్డు అధికారులు స్పందించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలను ఎందుకు నిర్వహిస్తున్నారో సమాధానం చెప్పాలని కార్పొరేట్ యాజమాన్యాలకు జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల దురాగతాలపై రాష్ట్ర ఇంటర్ బోర్డు అధికారులకు కూడా నివేదిక పంపినట్లు తెలిసింది. త్వరలో రాష్ట్ర ఇంటర్ బోర్డు అధికారులు జిల్లాకు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కళాశాలల్లో తనిఖీ చేయనున్నట్లు సమాచారం.

## అభిమానాన్ని అడ్డుకోలేని ఆంక్షలు

- జిల్లా సెంట్రల్ జైలు నుంచి మాజీ మంత్రి కాకాణి విడుదల
- బయటకు వచ్చాక అడుగడుగునా అభిమానుల కోలాహలం



కాకాణి గోవర్ధన్‌రెడ్డిని తమ భుజాలపైకి ఎత్తుకున్న వైఎస్సార్‌సీ నాయకులు

వెంకటాచలం: కూటమి ప్రభుత్వం మోపిన అక్రమ కేసులతో జైలుకు వెళ్లిన మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి 86 రోజుల తర్వాత బుధవారం నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. హైకోర్టు సోమవారమే బెయిల్ మంజూరు చేసినప్పటికీ గూడూరు కోర్టు నుంచి బెయిల్ మంజూరు పత్రాలు ఇవ్వడంలో ఆలస్యం కావడంతో మంగళవారం జైలు నుంచి విడుదల కాలేకపోయారు. మంగళవారం కాకాణి జైలు నుంచి విడుదలవుతారని తెలియడంతో జిల్లాలోని వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు, సర్వేపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వస్తారని పోలీసులు అడుగడుగున ఆంక్షలు విధించారు. ఆయనకు స్వాగతం పలుకుతూ అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. అయినప్పటికీ ముఖ్యనేతలతోపాటు అభిమానులు జైలు పరిసర ప్రాంతాలకు చేరుకుని సాయంత్రం 6.30 గంటల వరకు ఎదురు చూశారు. అయితే సాంకేతిక కారణాలతో విడుదల జాప్యం జరగడంతో కాకాణి బుధవారం విడుదలవుతారని తెలియడంతో నిరాశగా వెనుతిరిగారు. అయితే బుధవారం ఉదయం 8 గంటల అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత తదితరులు వేలాది మంది జిల్లా సెంట్రల్ వద్దకు చేరుకున్నారు. జైలుకు వెళ్లే రోడ్డు మార్గాల్లో వేలాది మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు చేరుకోవడాన్ని చూసి పోలీసులు ముఖ్య నేతలను మినహా, మిగతా అందరిని జైలు పరిసర ప్రాంతాల్లో లేకుండా తరిమేశారు.

**కాకాణి బయటకు రావడంతో..**
కాకాణి గోవర్ధన్ రెడ్డి ఉదయం 10.20 గంటలకు జైల్లో నుంచి బయటకు రావడంతో అంత వరకు ఓపిగ్గా ఎదురుచూసిన అభిమానులు పోలీసుల ఆంక్షలను దాటుకుని జయహో గోవర్ధనన్న, జై జగన్, జై కాకాణి అంటూ నినాదాలు హోరెత్తించారు. కాకాణిని నాయకుల భుజాలపైకి ఎత్తుకుని తమ అభిమానాన్ని చాటుకున్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి జైల్లో ఉన్నంత సేపు అనేక ఆంక్షలు విధించిన పోలీసులు, ఒక్కసారిగా వచ్చిన అభిమానాలను చూసి అడ్డుకోలేకపోయారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన కుమార్తె పూజిత, మనుమడు, ఇతర కుటుంబ సభ్యులతో పాటుగా, వైఎస్సార్‌సీపీ నాయకులను ఆప్యాయంగా పలకరించారు. జైలు వద్ద నుంచి కారులో బయలుదేరిన కాకాణి గోవర్ధన్ రెడ్డికి దారిపొడవునా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానాలు ఆత్మీయ స్వాగతం చేశారు. కొందరు శాలువాలతో సన్మానించారు. జైలు వద్ద నుంచి నక్కలకాలనీ, మీదుగా, జాతీయ రహదారిపై కారులో వెళుతూ ప్రతి ఒక్క నాయకుడిని పేరు పేరునా పలకరిస్తూ వెళ్లారు.

## రాజకీయంగా ఎదుర్కోలేక కుట్ర కేసు

- ప్రతాప్‌కుమార్‌రెడ్డి వ్యక్తిత్వం, కృష్ణారెడ్డి వైఖరి ఏమిటో అందరికీ తెలును
- దాడులు, అక్రమ కేసులే టీడీపీ పాలనా విధానం
- అధికార మదంతో చేసే ప్రతి పనికీ బుద్ధి చెబుతాం
- అక్రమ కేసులకు వైఎస్సార్‌సీపీ నేతలు సిద్ధం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి (జలదంకి): కావలి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ప్రస్తుత ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నాడని, అటువంటి నీచ సంస్కృతిని విడనాడకపోతే అధికార మదంతో చేసే ప్రతి పనికీ బుద్ధి చెబుతామని కావలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు హెచ్చరించారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిటి కామరాజు మాట్లాడుతూ అక్రమ మైనింగ్ జరుగుతుండడంతో విజువల్స్ తీసేందుకు వెళ్లిన సోషల్ మీడియా యాక్టివిస్టులను పట్టుకుని, దారుణంగా హింసించడమే కాకుండా వారిని హంతకులుగా చిత్రీకరించేందుకు ఎమ్మెల్యే కృష్ణారెడ్డి బరి తెగింపునకు త్వరలోనే బుద్ధి చెబుతామన్నారు. సౌమ్యుడు, మితభాషి అయిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నీచ సంస్కృతి, రౌడీ రాజకీయం చేసే నీలాంటి వాడిని చంపించే ప్రయత్నం చేశారంటూ నువ్వు చేస్తున్న ప్రచారం చూసి నియోజకవర్గ ప్రజలు నివ్వెరపోతున్నారన్నారు. కుట్రలకు, కుతంత్రాలతో ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టడానికి, నీ అవినీతి సామ్రాజ్యాన్ని బయట పెట్టాలకున్న సోషల్ మీడియా సభ్యులను కొట్టి, వారి చేతుల్లో కత్తులు పెట్టించి బెదిరించి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పంపిస్తే కృష్ణారెడ్డిని చంపడానికి వచ్చామని వీడియో రికార్డు చేయించారన్నారు. పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కావలిలో ఏదో జరిగిపోయింది, ఎమ్మెల్యేపై హత్యాయత్నం అంటూ అంబేద్కర్ విగ్రహం వద్ద కొంత మంది ఏడుపులు, పెడబొబ్బలు పెట్టారని, అసలు జరిగింది తెలుసుకోకుండా, పోలీసులు విషయాన్ని తెలపకుండానే నలుగురు చిడతల విలేకరులు స్క్రోలింగ్ పెడితే అదే వాస్తవమని ఇలా దౌర్భాగ్యపు రాజకీయాలు చేస్తున్నా రో తెలుసుకోవాలన్నారు. ముసునూరు మనీ స్కాంలో ఎమ్మెల్యేకు ఎంత ముడుపులు అందాయో నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. నియోజకవర్గంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు, ఇసుక దందా, రేషన్ దందా ఎలా నిర్వహిస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇలాంటి అవినీతి దందాలను మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి నిత్యం ఎండగడుతుండడంతో ఎమ్మెల్యే అసహనంతో ఊగిపోతూ వీధి రౌడీలా మాట్లాడిన మాటలను ప్రజలను తెలుసుకున్నారన్నారు. జలదంకిలో డ్రోన్ సాయంతో అక్రమ మైనింగ్‌పై విజువల్స్ తీసిన అమాయకులపై అక్రమ కేసులు పెట్టడం చూస్తుంటే రక్తచరిత్ర సినిమాను మించి దర్శకత్వం చేసినట్లు ఉందన్నారు. మాజీ ఎంపీపీ మహేశ్వరమ్మ మాట్లాడుతూ అధికారం నీటి బుడగతో సమానం అని, కక్ష రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. పార్టీ నాయకులు గంధం ప్రసన్నాంజనేయులు, కనమర్లపూడి వెంకటనారాయణ, మద్దిబోయిన వీరరఘు, వాయిల తిరుపతి, నెల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, పరుసు మాల్యాద్రి, కుందుర్తి కామయ్య, కనపర్తి రాజశేఖర్, చైతన్య, మహేష్ నాయుడు, దండే కృష్ణారెడ్డి, బీద రమేష్, కొమారి రాజు, చెన్ను ప్రసాద్‌రెడ్డి, నాగాచారి, ఏగూరి పుల్లయ్య, గుడ్లూరి మాల్యాద్రి, ఏసుదాస్, శశిధర్, జీవీ, గిరి, చల్లా శ్రీనివాసులరెడ్డి, కళ్యాణి పాల్గొన్నారు.

## అంతర్ జిల్లాల బదిలీలకు దరఖాస్తులు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, నెల్లూరు కార్పొరేషన్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు స్పౌజ్, మ్యూచువల్ ప్రాతిపదికన లీప్ యాప్‌లో అంతర్ జిల్లాల బదిలీకి దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న ప్రింట్ కాపీని సంబంధిత ఎంఈఓకు 21న ఆందజేయాలన్నారు. 22న ఎంఈఓ కార్యాలయం, 23న డీఈఓ కార్యాలయంలో వెరిఫికేషన్, 27న రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని, 28, 29వ తేదీల్లో అక్కడ వెరిఫికేషన్, 30న ప్రభుత్వానికి పంపనున్నామని పేర్కొన్నారు. అంతర్ జిల్లాల బదిలీలకు అర్హత, ఇతర వివరాలకు deonellore.50 webs. com ను సంప్రదించాలని సూచించారు.





# కల్వర్టును ఢీకొన్న బొలెరో

- దంపతుల దుర్మరణం
- ప్రాణాలతో బయటపడిన చిన్నారులు
- తెలంగాణలోని జనగామ జిల్లాలో ఘటన




ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లోక్షణ, మోక్షజ్ఞ




దివ్య, సురేశ్ మృతదేహాలు

లింగాలఘణపురం: బొలెరో అదుపుతప్పి కల్వర్టును ఢీకొనడంతో దంపతులు మృతి చెందగా, ఇద్దరు పిల్లలు ప్రాణాలతో బయటపడిన ఘటన జనగామ – సూర్యాపేట జాతీయ రహదారి 365పై జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వడిచర్ల సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల మేరకు.. నెల్లూరు జిల్లాలోని మనుబోలు మండలం వడ్లపూడికి చెందిన దద్దోజు సురేశ్ (35), దివ్య దంపతులు (32), కుమారుడు మోక్షజ్ఞ, కుమార్తె లోక్షణతో కలిసి స్వగ్రామం నుంచి బొలెరోలో తాను పని చేసే కరీంనగర్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో నిద్రమత్తులో సురేశ్ డ్రైవింగ్ చేయడంతో వాహనం అదుపు తప్పి వడిచర్ల సమీపంలో కల్వర్టును ఢీకొంది. ఘటనలో దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. పిల్లలు స్వల్పంగా గాయపడటంతో 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు. కరీంనగర్‌లోని ఓ గ్రానైట్ కంపెనీలో సురేశ్ పనిచేస్తున్నారని సమాచారం. కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రమాదంలో తల్లిదండ్రులు మరణించగా, ఏమి జరిగిందో తెలియని స్థితిలో ఉన్న ఆ చిన్నారులను చూసి స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. విషయాన్ని చెప్పలేక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సను అందిస్తున్నారు.

### పెళ్లి రోజే చివరి రోజు

మనుబోలు: వివాహ వేడుక నిమిత్తం స్వగ్రామానికి వచ్చి వారం పాటు సరదాగా గడిపారు. సెకండ్ షో సినిమాకు వెళ్లి సేదదీరారు. తమ పెళ్లి రోజు సందర్భంగా తిరిగి ఉద్యోగం చేస్తున్న ప్రాంతానికి వెళ్తున్న ఓ కుటుంబంపై విధి పగబట్టింది. మృత్యువు రోడ్డు ప్రమాద రూపంలో కబళించింది. ఈ ఘటనతో మండలంలోని వడ్లపూడిలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన దద్దోలు పెంచలయ్య, జయమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు సురేశ్ కరీంనగర్‌లోని ఓ గ్రానైట్ కంపెనీలో మార్కర్‌గా పని చేస్తూ కుటుంబంతో కలిసి అక్కడే నివాసముంటున్నారు. వారం క్రితం బంధువుల పెళ్లి ఉండటంతో సురేశ్ దివ్య (32) దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి వడ్లపూడికి వచ్చారు. కుటుంబసభ్యులు, బంధువులతో సరదాగా గడిపి.. పొదలకూరులో సెకండ్ షో సినిమాకు మంగళవారం వెళ్లారు. బుధవారం వారి పెళ్లి రోజు కావడంతో వేకువజామునే కారులో బయల్దేరారు. నిద్రమత్తులో కల్వర్టును వాహనం ఢీకొనడంతో తెలంగాణలోని జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వడిచర్ల వద్ద వీరు మృత్యువాత పడ్డారు. ఘటనతో వడ్లపూడి విషాదంలో మునిగిపోయింది. తమ ముందు సంతోషంగా తిరిగిన జంట ఇక లేరని తెలిసి ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమవుతున్నారు.



సురేశ్, దివ్య (ఫైల్)

## సహకార సంఘ సభ్యులకు శిక్షణ



సంఘ సభ్యులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న గుర్రప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు రూరల్ వ్యవసాయ, అనుబంధ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘ సభ్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని డీసీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ గుర్రప్ప మాట్లాడారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని వ్యవసాయంలో సాంకేతికత, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇచ్చామని వివరించారు. అనంతరం సంఘ సభ్యులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, నిబంధనావళి ప్రతలను అందజేశారు. డీసీఓ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పోర్టు ఆధారిత పరిశ్రమలతో ఉపాధి

- కలెక్టర్ ఆనంద్

కందుకూరు: రామాయపట్నం పోర్టు ఆధారంగా ఏర్పడుతున్న పరిశ్రమలతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. గుడ్లూరు మండలం చేవూరు పరిధిలో ఏర్పాటైన ఇండోసోల్ కంపెనీలో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తూ నియామక పత్రాలను బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రామాయపట్నం పోర్టు ఆధారిత పరిశ్రమలకు భూములిచ్చిన రైతు కుటుంబాల్లోని యువతకు ఉద్యోగాలు కల్పించి వారికి అండగా ఉంటున్నామని తెలిపారు. ఇండోసోల్, బీపీసీఎల్ కంపెనీల ఏర్పాటుతో స్థానికులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించనున్నాయని వెల్లడించారు. ఇండోసోల్ కంపెనీలో 68 మందికి ఉద్యోగాలను ప్రస్తుతం కల్పిస్తున్నారని తెలిపారు. ఇతరులకు సైతం వారి విద్యార్హత ఆధారంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలను కల్పించనున్నామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. కాకినాడ, విశాఖపట్నం పోర్టుల తరహాలో రామాయపట్నం పోర్టూ అభివృద్ధి చెందుతుందని చెప్పారు.



మాట్లాడుతున్న ఆనంద్

**ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి**

ఇండోసోల్ కంపెనీలో ఉద్యోగాల కోసం అర్హత గల యువత దరఖాస్తు చేసుకోవాలని, వీటిని కంపెనీ కార్యాలయం లేదా ఈ మెయిల్‌కు పంపొచ్చని సంస్థ హెచ్ఆర్ ప్రతినిధి, కంపెనీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి భారతి పేర్కొన్నారు. అభ్యర్థుల అర్హతల మేరకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలను కల్పిస్తామని, శిక్షణ కార్యక్రమాలను సెప్టెంబర్ ఒకటి నుంచి ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, ఇండోసోల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బాలచందర్‌కృష్ణన్, బైరెడ్డి రంగారెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి అబ్దుల్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ | : రూ.113 |
| లేయర్ | : రూ.118 |
| బ్రాయిలర్ చికెన్ | : రూ.210 |
| స్కిన్‌లెస్ చికెన్ | : రూ.234 |
| లేయర్ చికెన్ | : రూ.200 |

## అక్రమంగా హౌసింగ్ స్టీల్ తరలింపు

దుత్తలూరు: దుత్తలూరు హౌసింగ్ బోర్డు గోదాము వద్ద ఉన్న హౌసింగ్‌కు సంబంధించిన స్టీల్‌ను సొంత శాఖ వారే అక్రమంగా తరలిస్తూ బుధవారం పట్టుబడ్డారు. వివరాలు.. గృహ నిర్మాణాలకు ఉపయోగించే స్టీల్‌ను స్థానిక ఏసీ కాలనీ సమీపంలోని హౌసింగ్ గోదాము వద్ద ఓ వాహనంలో లోడ్ చేస్తుండగా, అనుమానమొచ్చిన స్థానికులు వారిని ప్రశ్నించారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఫొటోలు తీసి హౌసింగ్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్థానిక పోలీసులకు వారు సమాచారమివ్వడంతో పరిసర మండలాల పీఎస్‌లకు తెలియజేశారు. సీతారామపురం మండలం పోలంగారిపల్లి వద్ద వాహనాన్ని గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్టీల్‌తో పాటు వాహనాన్ని దుత్తలూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై హౌసింగ్ ఏఈ ఫిర్యాదు చేశారు. ఉదయగిరి మండలానికి చెందిన హౌసింగ్ అధికారి తన వాహనాన్ని బాడుగకు పిలిచారని, ఈ కారణంగానే వచ్చానని విచారణలో డ్రైవర్ తెలిపారు. సుమారు 900 కిలోల బరువుండి.. రూ.55 వేల విలువజేసే స్టీల్‌ను తరలించేందుకు యత్నించారు.



పోలీసుల అదుపులో వాహనం

విషయం తెలుసుకున్న హౌసింగ్ ఈఈ నారాయణరెడ్డి, డీఈ పీరాన్ దుత్తలూరుకు వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించి స్థానిక అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. కాగా ఎవరైతే ఆరోపణలు ఎదుర్కొంటున్నారో వారిపై శాఖాపరంగా విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని ఈఈ తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## పెరోల్ రచ్చ.. అరుణ అరెస్ట్

- ఆమెతో పాటు మరో ముగ్గురూ..
- డైవర్షన్‌లో భాగంగా పాత కేసులో అరెస్ట్ చేసిన వైనం

కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం, హోంశాఖ, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులను కుదిపేస్తున్న నెల్లూరు జిల్లా జైల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్న శ్రీకాంత్ పెరోల్ వ్యవహారం నేపథ్యంలో డైవర్షన్ రాజకీయాలకు తెరతీశారు. ఈ కేసులో సంచలనానికి కేంద్రబిందువైన శ్రీకాంత్ స్నేహితురాలు నిడిగంటి అరుణ మంగళవారం టీడీపీ నేతల బాగోతాలన్ని బయటపెడతానంటూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు తెగ వైరలైంది. ఇది జరిగిన 24 గంటలు గడవక ముందే అరుణను కట్టడి చేసేందుకు ఈ కేసుకు సంబంధించి కాకుండా ఎప్పటిదో వేరే కేసును తిరగదోడి బుధవారం అరెస్ట్ చేయడం సంచలనం సృష్టిస్తోంది. బిల్డర్ నుంచి బలవంతంగా ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు యత్నించింటూ అరుణతో పాటు మరో ముగ్గుర్ని కోవూరు పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు.

**ఇదీ కేసు..**

బిల్డర్ మునగ వెంకట మురళీకృష్ణమోహన్ 2010లో పెద్దపడుగుపాడులో సాయి ఎన్‌క్లేవ్ పేరుతో 15 ఫ్లాట్లతో కూడిన అపార్ట్‌మెంట్ నిర్మించారు. అందులో 14 ఫ్లాట్లు విక్రయించగా, 503 ఫ్లాట్‌ను తన ఆధీనంలో ఉంచుకున్నారు. 2020 డిసెంబర్‌లో నిడిగుంట అరుణ ఆ ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుంది. అనంతరం ఆ ఫ్లాట్ తన తండ్రి పేరిట రిజిస్టర్ చేసుకోవాలని 2022 అక్టోబర్‌లో ఒప్పందం చేసుకుని రూ.3 లక్షలు అడ్వాన్స్ ఇచ్చింది. మిగిలిన రూ.25 లక్షలు 2023 ఫిబ్రవరి నాటికి చెల్లిస్తానని అంగీకారం చేసుకున్నారు. అయితే అప్పటి నుంచి ఒక్క రూపాయి కూడా చెల్లించకపోగా అద్దెను కూడా నిలిపివేసింది. ఈ వ్యవహారమై కోర్టులో కేసు కొనసాగుతుండగా అరుణ తన అనుచరులు పల్లం వేణు, అంకెం రాజా, శీరం ఎలీషాతో కలిసి వెంకట మురళీకృష్ణమోహన్‌ను బెదిరించి పెళ్లకూరు కాలనీలోకి తీసుకెళ్లి తాను రూ.25 లక్షలు చెల్లించినట్లు పత్రంపై సంతకం చేయించుకున్నారు. ఆపై తరచూ ఫ్లాట్ రిజిస్టర్ చేయాలని ఒత్తిడి పెంచారు. మాట వినకపోతే ప్రాణాలతో ఉండవని హెచ్చరించారు.




నిడిగుంట అరుణను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు

**పెరోల్ వ్యవహారాన్ని పక్కదోవ పట్టించేందుకు..**

అరుణ స్నేహితుడు శ్రీకాంత్ పెరోల్ వ్యవహారం రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న నేపథ్యంలో దీన్ని డైవర్ట్ చేయడానికి అరుణపై ఉన్న ఈ కేసును బయటకు తోడారు. అరుణతోపాటు పల్లం వేణు, అంకెం రాజా, శీరం ఎలీషాను అరెస్ట్ చేసేందుకు ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య, రూరల్ డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్‌గౌడ్ ప్రత్యేక బృందాలతో నిఘాను ఏర్పాటు చేశారు. అరుణ మంగళవారం రాత్రి నెల్లూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా, అద్దంకి టోల్ ప్లాజా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులలో అరుణతో పాటు వేణు, రాజా, అన్వర్, ముసబీర్, గణేష్, ఎలీషా ఉన్నారు. అయితే అన్వర్, ముసబీర్, గణేష్ పరారీలో ఉన్నారు. అరెస్ట్ చేసిన వారిని నెల్లూరు కోర్టులో హాజరుపర్చారు

### ఒంగోలు జిల్లా జైలుకు..

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ వ్యవహారంలో అతడి సన్నిహితురాలు అరుణను నెల్లూరు పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. కావలి కోర్టులో హాజరుపర్చగా, 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో ఆమెను ఒంగోలు జిల్లా జైలుకు రాత్రి పది గంటలకు నెల్లూరు పోలీసులు తరలించారు.



### క్లుప్తంగా

#### ఎల్ఐసీ కార్యాలయాల వద్ద ధర్నా



నెల్లూరు(అర్బన్): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని పలు బ్రాంచ్‌ల వద్ద ఏజెంట్లు ధర్నాను ఎల్ఐసీ ఏఓఐ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. దర్గామిట్టలోని సిటీ బ్రాంచ్-1, బృందావనంలోని 2 వద్ద ఆందోళనను నిర్వహించారు. ఈ సందర్భంగా సీబీ – 2 వద్ద యూనియన్ సీనియర్ నేత మేకల నరసింహారావు మాట్లాడారు. ఎల్ఐసీలో వాటాల విక్రయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. పాలసీదారుల ప్రీమియంపై జీఎస్టీని తొలగించాలని చెప్పారు. గ్రూపు ఇన్సురెన్స్ కవరేజీని 25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా బ్రాంచ్ మేనేజర్లకు వినతిపత్రాలను అందజేశారు. డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు నరసింహరావు, నరసింహులు, సీబీ – 2 అధ్యక్షుడు పుట్టయ్య, హాజరత్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఐసీఈయూ నేతలు కమలాకర్‌రావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

#### మోటార్ల భద్రతపై ఆందోళన



దొంగలు అపహరించిన వైరును చూపుతున్న రైతు

మర్రిపాడు: మండలంలోని పొలాల్లో మోటార్లు ఏర్పాటు చేసుకొని పంటలను సాగు చేస్తున్న రైతులు కలవరానికి గురవుతున్నారు. విద్యుత్ ఎప్పుడు సరఫరా అవుతుందానని గతంలో నిరీక్షించేవారు. అయితే ప్రస్తుతం వీరికి మరో చిక్కొచ్చి పడింది. చిల్లర దొంగతనాలకు అలవాటుపడిన కొందరు.. రైతుల వ్యవసాయ మోటార్లలో విలువైన కాపర్ వైర్లను అపహరిస్తూ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఓపెన్ సబ్ మెర్సిబుల్ మోటార్లు నీటిలో ఉండేవి కావడంతో స్టార్టర్ల నుంచి మోటార్ వరకు వైరు ఉంటుంది. దీంతో దొంగలు వీటిని టార్గెట్ చేసి చోరీకి పాల్పడుతున్నారు.

**30 వైర్ల చోరీ**

మండలంలోని నాగరాజుపాడులో 30 మోటార్ల మధ్య అనుసంధానంగా ఉండే వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి చోరీ చేశారు. దీంతో రైతులు వల్లెం వెంకటయ్య, సుబ్బరాయుడు, సుధాకర్, పెరుమాళ్లనాయుడు, శ్రీనివాసులు, కోడూరు బ్రహ్మయ్య లబోదిబోమంటున్నారు. పోలీసులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

#### క్రెడిట్ కార్డుల నుంచి నగదు మాయం

నెల్లూరు సిటీ: తన రెండు క్రెడిట్ కార్డుల నుంచి దశల వారీగా నగదు మాయమైందంటూ చిన్నబజార్ పోలీసులకు బాధితుడు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు సమాచారం మేరకు.. మూలాపేటలోని మహేశ్వరినగర్‌లో నివాసం ఉంటున్న శివశంకర్‌రావుకు రెండు క్రెడిట్ కార్డులున్నాయి. కొన్ని రోజులు క్రితం వీటి నుంచి దశలవారీగా రూ.48 వేలు, రూ.40,001, రూ.45 వేలు, రూ.1,99,998 నగదు మాయమైంది. దీనికి సంబంధించి మెసేజ్‌లు రావడంతో బాధితుడు ఆందోళనకు గురయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

#### ముగ్గురికి కారుణ్య నియామక పత్రాలు



నెల్లూరురూరల్: వివిధ శాఖల్లో ఉద్యోగాలు చేస్తూ మృతి చెందిన ముగ్గురి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలను కలెక్టరేట్లో డీఆర్వో హుస్సేన్‌సాహెబ్ బుధవారం అందజేశారు. శ్రీకాళహస్తి మండలంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన హేమంత్‌కుమార్ భార్య మీనాక్షిని వీఆర్వో గ్రేడ్ – 2గా నియమించారు. పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ మృతి చెందిన రమేష్ భార్య నిరోషాకు పశుసంవర్ధక శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా, ఆర్టీసీలో డ్రైవర్‌గా పని చేస్తూ చెంచురత్నం మృతి చెందడంతో ఆయన కుమారుడు శరణ్ వెంకటతేజకు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా నియమించారు. ఏఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

#### పొదలకూరు నిమ్మ ధరలు



| | |
|---|---|
| పెద్దవి | : రూ.50 |
| సన్నవి | : రూ.40 |
| పండ్లు | : రూ.20 |